


న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలకు 384 మంది గైర్హాజరు

కామారెడ్డి టౌన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 9,337 మంది విద్యార్థులకుగాను 8,953 మంది హాజరయ్యారు. 384 మంది గైర్హాజరయ్యారు. జనరల్ గ్రూప్‌లలో 7,347 మందికిగాను 7,116 మంది పరీక్ష రాశారు. వొకేషనల్ కోర్సులలో 1,990 మందికిగాను 1,837 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం ఇంటర్ పరీక్షలను పర్యవేక్షించారు.

అన్ని రంగాల్లో రాణించాలి



నిజాంసాగర్: మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. వంటింటికే పరిమితం అనుకున్న తనకు బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో రాజకీయాల్లో అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. అలాగే కామారెడ్డి జిల్లాకు మొదటి జెడ్పీ చైర్‌పర్సన్ అయ్యానని గుర్తు చేశారు. మహిళలందరూ అంచెలంచెలుగా ఎదగాలని సూచించారు. చదువులు, ఉద్యోగాలతోపాటు రాజకీయాలలోనూ రాణించాలని ఆకాంక్షించారు. మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

తలసేమియా బాధితులకు ఆరోగ్యశ్రీ సేవలు

కామారెడ్డి అర్బన్: తలసేమియా బాధితులకు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రక్తమార్పిడితో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తలసేమియాతో బాధపడేవారు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుతో సంప్రదించాలని, ప్రతి మంగళ, గురు, శని వారాల్లో రక్తమార్పిడి చేస్తారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 08462-222002 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మెరుగైన వైద్యం అందించాలి



ఆస్పత్రిని పరిశీలిస్తున్న టీం సభ్యులు

నాగిరెడ్డిపేట : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని నేషనల్ హెల్త్ క్వాలిటీ టీం సభ్యులు సూచించారు. బృందం సభ్యులు శుక్రవారం ఆత్మకూర్‌లోని పల్లె దవాఖానాను తనిఖీ చేశారు. వసతులను, రిజిస్టర్లను పరిశీలించారు. రోగులతో ఎలా ప్రవర్తించాలో సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు రాధిక, పద్మజ, జహేరా, నాగిరెడ్డిపేట పీహెచ్‌సీ డాక్టర్ సృజన్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఎడిటర్‌గా జిల్లా జడ్జి

- రిపోర్టర్ల కథనాలను ప్రాధాన్యత మేరకు ఎంపిక చేయడం సంతోషంగా ఉంది
- ఎప్పటికీ మరిచిపోలేని అనుభూతినిచ్చింది
- పాత్రికేయ వృత్తిలో ఉన్న కష్టం పూర్తిస్థాయిలో తెలిసింది
- వార్తల సేకరణ నుంచి పత్రిక పాఠకులకు చేరవేసే వరకు పడే కష్టం గొప్పది
- జిల్లా జడ్జి సునీత కుంచాల

నిజామాబాద్ 'సాక్షి' ఎడిషన్ కేంద్రంలో శుక్రవారం జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల 'గెస్ట్ ఎడిటర్'గా వ్యవహరించారు. జిల్లాలోని రిపోర్టర్లు రాసిన కథనాలను, వార్తలను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసి డెస్క్ బృందానికి ఇచ్చారు. అదేవిధంగా పలు రకాల సూచనలు చేశారు. 'సాక్షి' గెస్ట్ ఎడిటర్‌గా రావడం చాలా సంతోషం కలిగించిందన్నారు. పాఠకులకు కేవలం రూ.5 లకు ఇచ్చే పత్రికను బయటకు తీసుకొచ్చేందుకు ఎంత కష్టముంటుందో ప్రత్యక్షంగా చూడడం కొత్త అనుభవాన్నిచ్చిందన్నారు. వార్తల సేకరణ మొదలు పత్రిక పాఠకుడికి చేరేవరకు ప్రతి అడుగు జాగ్రత్తగా వేస్తూ అనేకమంది పడుతున్న శ్రమ సాధారణమైనది కాదన్నారు. ఎప్పటికీ మరిచిపోలేని అనుభవాన్ని పొందానన్నారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



మహిళ శక్తి అనంతం


■ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సునీత కుంచాల మాట్లాడారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకెళితే సాధించలేనిది ఏమీ లేదన్నారు. పట్టుదలతో ముందుకెళ్లాలన్నారు. ప్రతి మహిళలోనూ ఓపికతో పాటు శక్తి ఎంతో ఉంటుందన్నారు. శక్తిని సమయాన్ని, సందర్భాన్ని బట్టి ఉపయోగిస్తే అద్భుత ఫలితాలను సాధించొచ్చన్నారు. వర్కింగ్ ఉమెన్స్ చాలెంజింగ్‌గా ముందుకు వెళ్లాలన్నారు. గృహిణులను ఏమాత్రం తక్కువ చేసి చూడొద్దన్నారు. గృహిణులు చేసే కష్టంతోనే భావి పౌరుల జీవితాలు వికసిస్తున్నాయన్నారు. గృహిణుల కష్టాన్ని పురుషులు తరచూ చేసే ప్రయత్నం చేస్తే విలువ తెలుస్తుందన్నారు. ప్రతి పురుషుడి విజయం వెనుక మహిళ ఉన్నట్లే, ప్రతి మహిళ విజయం వెనుక పురుషుడు ఉంటే సమాజానికి ఎనలేని మేలు కలుగుతుందన్నారు. మహిళలకు తండ్రి, భర్త, కుమారుడు, స్నేహితుడు అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ సహకరిస్తే ఏదైనా సాధిస్తారన్నారు.



సాక్షి ఎడిషన్ కార్యాలయంలో రిపోర్టర్లు పంపిన వార్తలను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

ఎన్నాళ్లీ వివక్ష..!

- అన్నింటా రాణిస్తున్న మహిళలు
- అయినా చిన్నచూపు చూస్తున్న సమాజం
- ఇంటాబయట పెరుగుతున్న వేధింపులు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మహిళలు అన్నింటా రాణిస్తూ అసాధ్యాలను సుసాధ్యం చేస్తున్న నేటి రోజుల్లోనూ వివక్ష పోవడం లేదు. కడుపులో నలుసు పడిందంటే చాలు ఆడో, మగో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆడపిల్ల అయితే కడుపులోనే తుంచేస్తున్నారు. దీంతో ఏటా జననాల్లో మగ పిల్లలకంటే ఆడపిల్లల నిష్పత్తి తక్కువగా ఉంటోంది. అలాగే నిత్యం ఏదో ఒక చోట ఆడవారిపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. విద్యాసంస్థలు, కార్యాలయాలు, పని చేసే ప్రాంతాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేధింపులు తప్పడం లేదు. 2023లో మహిళలపై వేధింపులు, అఘాయిత్యాలు, హింస తదితర నేరాలకు సంబంధించి 361 కేసులు నమోదు కాగా, 2024 సంవత్సరంలో 517 నమోదయ్యాయి.

పెరిగిన గృహ హింస

చాలా కుటుంబాల్లో మహిళలు అనేక రకాల హింసకు గురవుతున్నారు. తాగి వచ్చిన భర్త పెట్టే హింస, వివాహేతర సంబంధం నెరపుతూ కుటుంబాలను నిర్లక్ష్యం చేయడం పైగా భార్య, పిల్లల్ని వేధించడం వంటి సంఘటనలు పెరిగిపోతున్నాయి. అదనపు కట్నం కోసం అత్తింటివారి వేధింపులూ తగ్గడం లేదు. చదువుకున్న, ఉద్యోగం చేస్తున్న వారు సైతం అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని కుటుంబాల్లో అత్తింటి వేధింపులు భరించలేక కేసులు పెడుతున్నారు. మహిళలపై వేధింపులకు సంబంధించి నమోదవుతున్న కేసుల్లో గృహహింస కేసులే ఎక్కువగా ఉంటున్నా యి. జిల్లాలో గతేడాది 304 గృహహింస కేసులు నమోదయ్యాయి. 12 మంది హత్యకు గురయ్యారు. 2 వరకట్నపు మరణాలు, 3 గృహ హింస కారణంగా ఆత్మహత్యలు జరిగాయి.


లింగ నిష్పత్తిలో వ్యత్యాసం..

ఆడపిల్లలపై వివక్షతో కడుపులోనే తుంచేస్తుండడంతో ఏటా జననాల్లో ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉంటోంది. జిల్లాలో 2023 సంవత్సరంలో 11,302 మంది జన్మిస్తే అందులో 6,001 మంది మగ, 5,301 మంది ఆడపిల్లలు ఉన్నారు. అంటే ఆడపిల్లల సంఖ్య 700 తక్కువగా ఉంది. 2024లో 10,474 మంది పుడితే.. ఇందులో 5,447 మంది మగ, 5,027 మంది ఆడపిల్లలు. అంటే మగ పిల్లల కన్నా ఆడపిల్లలు 420మంది తక్కువ ఉన్నారు.

మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై 'సాక్షి' జిల్లాలో సర్వే నిర్వహించింది. ఆ వివరాలు..

పెరుగుతున్న లైంగిక వేధింపులు


ఆడవారిపై లైంగిక వేధింపుల సంఘటనలు ఏడాదికేడాది పెరిగిపోతున్నాయి. తెలిసిన వారు, రక్త సంబంధీకులు, ఇరుగు పొరుగు వారు చివరికి ఉపాధ్యాయుడు కూడా వేధింపులకు పాల్పడుతున్నారు. గతేడాది జిల్లాలో లైంగిక వేధింపులకు సంబంధించి 103 కేసులు నమోదయ్యాయి. ఇందులో 15 కేసులు స్కూళ్లలో విద్యార్థినులను వేధించిన ఉపాధ్యాయులపైనే ఉండడం గమనార్హం. జిల్లాలో గతేడాది 61 అత్యాచారం కేసులు, 25 కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. మహిళా ఉద్యోగినులు చాలాచోట్ల వేధింపులకు గురవుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఉన్నతాధికారులే మహిళా వైద్యులను వేధింపులకు గురిచేసిన సంఘటన గతంలో సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో ఇద్దరు అధికారులపై వేటు పడింది.



మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్న వారిలో అత్యధికులు ఎవరు?



మీ ఇంట్లో ఆడ, మగ వివక్ష ఏమైనా ఉందా ?



మీ కాలేజీ, పని ప్రదేశంలో మహిళగా ఏమైనా వివక్ష ఎదుర్కొంటున్నారా ?



మీరు ఎక్కువగా ఇబ్బంది పడుతున్న ప్రదేశం?

పాలనలో నారీ శక్తి

జిల్లాలో కీలక స్థానాల్లో పలువురు.. ★ ప్రత్యేకతను చాటుకుంటున్న అతివలు



సింధుశర్మ, ఎస్పీ; కిరణ్మయి, సబ్ కలెక్టర్; చైతన్యరెడ్డి, కామారెడ్డి ఏఎస్పీ; నిఖిత, జిల్లా అటవీ అధికారి; ప్రమీల, జిల్లా సంక్షేమ అధికారి; జ్యోతి, జిల్లా ఉద్యానశాఖ అధికారి; స్రవంతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారు. తమదైన ముద్ర వేస్తున్నారు. గతంలో చాలా విభాగాలకు మగవారే అధిపతులుగా ఉండేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. చాలామంది మహిళలు ఉద్యోగాలు చేస్తున్నారు. పలువురు ఉన్నతాధికారులుగానూ రాణిస్తున్నారు. జిల్లా కీలక ప్రభుత్వ శాఖల బాధ్యతలను మహిళా అధికారులే మోస్తున్నారు. జిల్లా స్థాయిలో, అలాగే డివిజన్, మండల స్థాయిలోనూ మహిళా అధికారులు మగవారికి దీటుగా పనిచేస్తూ గుర్తింపు పొందుతున్నారు. కొన్ని శాఖల్లో అయితే మహిళా అధికారులే ఎక్కువగా ఉంటున్నారు. ఐఏఎస్ అధికారిగా జిల్లాలోని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి నిత్యం ఊళ్లను చుట్టేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లా శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసు అధికారిగా ఐపీఎస్ ఆఫీసర్ సింధుశర్మ సమర్థవంతంగా పనిచేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. జిల్లా ఏర్పాటైన సమయంలోనూ తొలి ఎస్పీగా మహిళా ఐపీఎస్ శ్వేత నాలుగేళ్లకు పైగా పనిచేసి తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నారు. మరో ఐపీఎస్ అధికారి చైతన్యరెడ్డి కామారెడ్డి ఏఎస్పీగా పనిచేస్తున్నారు. ఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లుగా మహిళలు ఎంతో మంది పనిచేస్తున్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి ఏడీఏలుగా మహిళా అధికారులున్నారు. అలాగే మండల వ్యవసాయ అధికారులుగా, గ్రామ వ్యవసాయ విస్తీర్ణాధికారులుగా కూడా చాలా మంది మహిళలు సేవలందిస్తున్నారు. అటవీ శాఖలో జిల్లా అటవీ అధికారి నిఖితతో పాటు, కింది స్థాయిలో చాలా మంది మహిళా అధికారులున్నారు. మండలాల్లో ఎంపీడీవోలు, తహసీల్దార్లుగా మహిళలు సమర్థవంతమైన సేవలందిస్తున్నారు. గ్రామ పాలనలో పంచాయతీ కార్యదర్శులుగా యాభై మందికిపైగా మహిళలున్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రజిత, జిల్లా బాలల రక్షణ అధికారి స్రవంతి, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిర, ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీలత, డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫరీదాబేగం.. ఇలా ఎందరో అధికారులు జిల్లా పరిపాలనలో తమకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

ఎస్పీ సింధుశర్మ బదిలీ

- ఇంటెలిజెన్స్ ఎస్పీగా బాధ్యతలు
- కొత్త ఎస్పీగా రాజేశ్ చంద్ర నియామకం



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఎస్పీ సింధుశర్మ ఇంటెలిజెన్స్ ఎస్పీగా బదిలీ అయ్యారు. నూతన ఎస్పీగా రాజేశ్ చంద్రకు పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

2013 అక్టోబర్ 13న సింధుశర్మ కామారెడ్డి ఎస్పీగా బదిలీపై వచ్చారు. ఇక్కడ 17 నెలల పాటు వివాదాలకు తావులేకుండా పనిచేశారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాలనుకున్న సింధుశర్మ.. ఐదారు నెలలుగా బదిలీ కోసం ప్రయత్నిస్తున్నారు. గత నెలలో బదిలీ జరుగుతుందనుకున్న సమయంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. కోడ్ ఎత్తివేసిన మరుసటి రోజే ప్రభుత్వం ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సింధుశర్మను హైదరాబాద్‌లోని ఇంటెలిజెన్స్ ఎస్పీగా బదిలీ చేసిన సర్కారు.. ఆమె స్థానంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని యాదాద్రి భువనగిరిలో డిప్యూటీ పోలీస్ కమిషనర్‌గా కొనసాగుతున్న ఎం.రాజేశ్ చంద్రకు పోస్టింగ్ ఇచ్చింది. ఆయన 2015 బ్యాచ్‌కు చెందినవారు.

నిజామాబాద్ సీపీగా..

నిజామాబాద్ సీపీగా సాయి చైతన్య నియమితులయ్యారు. ఆయన నార్కోటిక్ బ్యూరో నుంచి బదిలీపై వచ్చారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

బీబీపేట: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని తాగునీటి బావి, ప్రకృతి వనం, నర్సరీతో పాటు ఇందిరమ్మ మోడల్ భవనాన్ని పరిశీలించారు. తాగునీటి బావిలో చెత్త పడకుండా జాలి ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం అంచనాలు సమర్పించాలని ఈఈని ఆదేశించారు. ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. బిల్డింగ్ నిర్మిస్తున్న కాంట్రాక్టర్ స్లాబ్‌కోసం ఇసుక కావాలని కోరగా మాచారెడ్డినుంచి తెప్పించడానికి ప్రయత్నిస్తానన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సతీష్ యాదవ్, ఏడీ శ్రీనివాస్, ల్యాండ్ సర్వే ప్రత్యేకాధికారి శ్రీనివాస్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో పూర్ణచంద్రోదయ్ కుమార్, ఎంపీవో అబ్బాగౌడ్, పంచాయతీ కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి బావి వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

పరీక్షలంటే భయాన్ని వీడాలి

పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని వీడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. మహిళల ప్రత్యేకతను వివరించాలని ఓ విద్యార్థిని కోరగా.. ఆమె బోర్డుపై మహిళల ఎదుగుదలను చార్ట్ రూపంలో వివరించింది. కలెక్టర్ విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.

మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత

కామారెడ్డి క్రైం : మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల రక్షణ కోసం జిల్లాలో ప్రతి పాఠశాలలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారిని నియమించామన్నారు. మహిళా శక్తి పథకం కింద పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మహిళలు వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, జడ్జి నాగరాణి సూచించారు. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, మహిళా శిశు సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఉత్తమ ఉద్యోగులకు బెస్ట్ ఎంప్లాయీ అవార్డ్స్ అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఏఎస్పీ చైతన్యరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫరీదా బేగం, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి స్రవంతి పాల్గొన్నారు.



మహిళా ఉద్యోగిని సన్మానిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

ఈవీఎం గోదాం పరిశీలన

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ సంగ్వాన్ శుక్రవారం పరిశీలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ తెరిచి ఈవీఎంలు, బ్యాలెట్, కంట్రోల్ యూనిట్‌లను, ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. భద్రతపై సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష.. జనాలకు నిరీక్షణ



మీ-సేవ కేంద్రం ముందు వేచియున్న జనాలు

రామారెడ్డి: ఇంటర్ పరీక్షల నేపథ్యంలో మండల కేంద్రంలోని జిరాక్స్ సెంటర్లు, మీ-సేవ కేంద్రాలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మూసి ఉంచుతున్నారు. ఇది తెలియని వివిధ గ్రామాల ప్రజలు ప్రతిరోజు మీ-సేవకు వివిధ పనుల నిమిత్తం ఉదయమే వచ్చి 12 గంటల వరకు మండుటెండలో వేచి ఉంటున్నారు.

మండల సమాఖ్య కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

నిజాంసాగర్(జుక్కల్): మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఐకేపీ ఏపీఎం రాంనారాయణగౌడ్ తెలిపారు. కొత్తగా ఎన్నికైన మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. మండల సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా దుద్దె అనిత(బూర్గుల్), కార్యదర్శిగా సావిత్రి(నర్సింగ్‌రావ్‌పల్లి), కోశాధికారిగా కృష్ణవేణి(ఆరేడ్) గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ సభ్యులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని షీ టీమ్ సభ్యులు ప్రభాకర్ సూచించారు. గోపాల్‌పేట మోడల్‌స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాల గురించి వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్, షీటీమ్ సభ్యులు శేషాద్రి, చిన్నసాయిలు, శ్రీనివాస్, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

భద్రతకు 'భరోసా'..!

- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భరోసా కేంద్రం
- మహిళా శిశు సంరక్షణ శాఖ పర్యవేక్షణలో సఖి కేంద్రం
- బాధితులకు అండగా ఆయా కేంద్రాలు
- మహిళలు, చిన్నారుల కోసం పలు రకాల సేవలు



కామారెడ్డిలోని సఖి సెంటర్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న భరోసా కేంద్రం సిబ్బంది(ఫైల్)

కామారెడ్డి క్రైం: మహిళలకు రక్షణ కల్పించడానికి ప్రభుత్వాలు అనేక చట్టాలు, ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసినా వారిపై హింస, దాడులు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. వేధింపులు, అత్యాచారాల ఘటనలు నిత్యం వెలుగుచూస్తూనే ఉన్నాయి. కేసుల సంఖ్యలో పెరుగుదల కనిపిస్తూనే ఉంది. ఇదిలా ఉండగా వారికి భద్రత కల్పించాలనే సంకల్పంతో వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే మహిళలు, బాలికల భద్రతకు పెద్దపీట వేస్తూ సరిగ్గా యేడాది క్రితం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డిలో 'భరోసా' కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అత్యాచారాలు, హింసకు గురైన బాధిత మహిళలకు అండగా ఉండటం, వారికి వైద్య, న్యాయపరమైన సహకారం అందించడం ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశం. దీంతో పాటు మహిళా, శిశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో పని చేసే 'సఖి కేంద్రం' ద్వారా కూడా బాధిత మహిళలు, చిన్నారులకు అనేక రకాల సేవలు అందుతున్నాయి.

పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు..

అత్యాచారాలు, హింసకు గురైన బాధితులకు మానసిక, వైద్య, న్యాయపరమైన సహకారాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చే ఉద్దేశంతో పోలీసుశాఖ లోని ఉమెన్స్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో 2024 ఫిబ్రవరి 16న భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనుభవం కలిగిన మహిళా ఉద్యోగులను నియమించి సేవలందిస్తున్నారు. ఈ కేంద్రం ద్వారా పోక్సో, మహిళలపై అత్యాచారాల కేసులను నియంత్రించడానికి పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బాధిత మహిళలు, బాలికలకు అండగా ఉండటం, న్యాయ సలహాలు, వైద్యం, ఇతర అన్ని రకాలుగా సహకారం అందించడం లాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. కామారెడ్డిలో భరోసా కేంద్రం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటివరకు 49 పోక్సో కేసులతో సహా మొత్తం 72 కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. ఆయా కేసుల్లో బాధితులందరికీ కౌన్సిలింగ్ ఇచ్చామని, ఆర్థికంగా వెనుకబడి ఉన్న 45 కుటుంబాల వారికి రూ.10.12 లక్షలు సహాయం అందించామని అధికారులు తెలిపారు.

మహిళలకు అండగా సఖి కేంద్రం ..

మహిళా, శిశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో సఖి కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడకు ఎక్కువగా అత్యాచారాలు, వేధింపులు, గృహహింసకు గురైన మహిళలు వస్తుంటారు. ఈ కేంద్రంలో ఒక వాహనం, అత్యవసర సమయాల్లో అందించేందుకు ప్రాథమిక వైద్య సదుపాయాలు ఉంటాయి. బాధిత మహిళలకు మానసిక మనోధైర్యాన్ని అందించడంతో పాటు సమస్యకు పరిష్కారమార్గాలు చూపడం, అవసరమైతే వసతి కల్పించడం, కౌన్సిలింగ్ నిర్వహించడం, వైద్య సహాయం, కేసు నమోదు, న్యాయ సహకారం లాంటి సేవలు అందుబాటులో ఉన్నాయి. కామారెడ్డి సఖి కేంద్రాన్ని గడిచిన యేడాది కాలంలో 1,319 మంది బాధితులు ఆశ్రయించారు. వారిలో 950 కేసులు పరిష్కారమయ్యాయి. మిగిలిన కేసులు వివిధ దశల్లో ఉన్నాయి. సఖి కేంద్రాన్ని 181 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి సంప్రదించవచ్చు.

పెరుగుతున్న నేరాలు..

జిల్లా వ్యాప్తంగా 2023లో 361 కేసులు నమోదు కాగా 2024లో వీటి సంఖ్య 517కు చేరింది. వీటిలో ఎక్కువగా గృహహింస కేసులే ఉంటున్నాయి. గతేడాది కేసుల్లో 12 హత్యలు, 2 వరకట్న మరణాలు, 61 అత్యాచారం కేసులు, 25 కిడ్నాప్, 3 గృహహింస కారణంగా జరిగిన ఆత్మహత్యలు, 304 గృహహింస, 103 లైంగిక వేధింపులకు సంబంధించిన కేసులున్నాయి.

సమస్యల పరిష్కారానికి కృషి



బాధిత మహిళలకు అవసరమైన వైద్య, న్యాయపరమైన సహకారం అందిస్తాం. అవసరమైన సందర్భాల్లో బాధిత మహిళలకు వసతి, మానసిక స్థైర్యాన్ని కల్పించడం, కౌన్సిలింగ్ లాంటి కార్యక్రమాలు చేపడుతున్నాం. కష్టకాలంలో మహిళలకు అన్ని రకాలుగా అండగా ఉండటమే సఖి కేంద్రం ముఖ్య ఉద్దేశం. వివిధ శాఖల సమన్వయంతో మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

– ప్రమీల, మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి, కామారెడ్డి

'స్టడీ అవర్స్‌ను సద్వినియోగం చేసుకోండి'

నస్రుల్లాబాద్ : స్టడీ అవర్స్‌ను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని డీఈవో రాజు సూచించారు. శుక్రవారం నస్రుల్లాబాద్‌లోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఆయన సందర్శించారు. పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలను పరిశీలించారు. బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో నూతన మెనూ అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి దయానంద్, ఎంపీడీవో సూర్యకాంత్, ప్రిన్సిపల్ మాధవరావు, వైస్ ప్రిన్సిపాల్స్ రాహుల్, పోశెట్టి ఉన్నారు.



విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించండి

- డీఈవో రాజు



వినతి పత్రం అందిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

బిచ్కుంద(జుక్కల్): విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని, పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత వచ్చే విధంగా కృషి చేయాలని డీఈవో రాజు అన్నారు. శుక్రవారం పుల్కల్‌లో హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎం ఆనంద్‌కుమార్ మిత్రుడు ఎన్ఆర్ఐ కరుణాకర్‌రెడ్డి పుల్కల్ పాఠశాల అభివృద్ధి కోసం రూ.2 లక్షల 50 వేలు విరాళాలు అందించారు.. వాటితో మురుగుదొడ్లు ఇతర పనులు చేయించారు. డీఈవో రాజు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఎన్ఆర్ఐలు పాఠశాలకు విరాళాలు అందించడం చాలా సంతోషకరమని అన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని వినతి..

బిచ్కుంద ఉర్దూ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయులు లేరు.. విద్యార్థుల చదువులు కొనసాగడం లేదు.. ఉపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయాలని డీఈవోకు ముస్లిం నాయకులు షేక్ హుస్సేన్, విద్యార్థుల తల్లిదండ్రులు వినతి పత్రం అందించారు. పై అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని అన్నారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయులకు సన్మానించారు. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌టీయూ నాయకులు సీమ శ్రీనివాస్, సయ్యద్ ఇర్షాద్ అలీ పాల్గొన్నారు.

'ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి'



ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మహిళా అధ్యాపకులతో ఏఎస్పీ చైతన్యరెడ్డి

కామారెడ్డి అర్బన్: మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చైతన్యరెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు అమ్మ, అమ్మమ్మలే స్ఫూర్తి అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సమన్వయకర్త శ్రీవల్లి, వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, సమన్వయకర్తలు విశ్వప్రసాద్, జయప్రకాష్, సుధాకర్, అధ్యాపకులు మానస, శారద, రాజశ్రీ, శ్రీలత, తబస్సుమ్, మీరాబాయి, వెన్నెల, గౌతమి, సత్యశ్రీ, భాగ్యలక్ష్మి, లత, వసంత తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో ఘనంగా మహిళా దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న న్యాయమూర్తులు

కామారెడ్డి టౌన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని న్యాయస్థానంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా న్యాయమూర్తులు, న్యాయవాదులు కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్ పాల్గొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు లాల్‌సింగ్, శ్రీనివాస్‌నాయక్, టి.నాగరాణి, సుమలత, సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రశాంతంగా ఉంటేనే పరీక్షలు బాగా రాయగలం'

బీబీపేట: మానసికంగా ప్రశాంతంగా ఉన్నప్పుడే పరీక్షలను బాగా రాయగలమని జిల్లా మానసిక వైద్యాధికారి జి.రమణ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా మానసిక వైద్యాధికారి రమణ హాజరై మాట్లాడారు. విద్యార్థులు మానసిక ప్రశాంతత కోసం ప్రతి రోజూ 30 నిమిషాల పాటు యోగా, మెడిటేషన్, వ్యాయామం లాంటివి చేయాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన టెలీ మానస్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 14416ని సంప్రదించి కౌన్సిలింగ్ పొందవచ్చునని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ వెంకట లక్ష్మి, జిల్లా సోషల్ వర్కర్ రాహుల్ కుమార్, సూపర్వైజర్ పద్మావతి, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి నుంచి డబ్బుల బ్యాగు లాక్కునే యత్నం



విచారణ జరుపుతున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: ఏటీఎంలో డబ్బులు డ్రా చేసుకుని వెళ్తున్న ఓ వ్యక్తి నుంచి డబ్బుల బ్యాగు లాక్కునేందుకు యత్నించిన ఓ నిందితుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈఘటన జిల్లాకేంద్రంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఏటీఎం వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. భిక్కనూర్ మండలానికి చెందిన బాలకృష్ణ కామారెడ్డిలోని ఏటీఎంకు వచ్చి రూ.లక్ష డ్రా చేశాడు. డబ్బును బ్యాగులో పెట్టుకుని ఇంటికి వెళ్లడానికి బైక్ తీస్తుండగా ఓ వ్యక్తి అక్కడకు వచ్చి అందరూ చూస్తుండగానే డబ్బుల బ్యాగును లాక్కునే ప్రయత్నం చేశాడు. ఇద్దరి మధ్య తోపులాట జరిగింది. అదే సమయంలో అక్కడే ఉన్న ఓ రాయి తగిలి నిందితుడు కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు నిందితుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. నిందితుడు బీబీపేట మండలం తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన నెల్లూరి స్వామిగా గుర్తించారు. నకిలీ డీఎస్పీగా చలామణి అవుతూ పలు మోసాలకు పాల్పడినట్లు అతడిపై గతంలో సిద్దిపేట, బీబీపేట పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పలు కేసులు ఉన్నాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్

గోదావరిలో మహిళ మృతదేహం లభ్యం



రెంజల్(బోధన్): మండలంలోని గోదావరి నదిలో శుక్రవారం ఓ మహిళ మృతదేహం లభించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. నదిలో మహిళ మృతదేహం తేలడంతో స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని స్థానిక జాలర్లతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలు బోధన్‌కు చెందిన శంకరమ్మ (62)గా గుర్తించినట్లు తెలిసింది. మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని సమాచారం. ప్రమాదవశాత్తు నదిలో పడి మృతిచెందినట్లు తెలుస్తోంది.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆత్మహత్యాయత్నం

బాన్సువాడ : బాన్సువాడలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ గురువారం ఆత్మహత్యకు యత్నించాడు. సాయంత్రం కృష్ణానగర్ తండా వద్ద కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగాడు. ఈ విషయాన్ని బాన్సువాడలో ఉన్న తన మేనత్తకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ఆమె అక్కడికి వెళ్లి వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించింది. ప్రస్తుతం శ్రీకాంత్ పరిస్థితి మెరుగ్గానే ఉన్నట్లు సమాచారం. శ్రీకాంత్ బాన్సువాడ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా 2018 నుంచి పనిచేస్తున్నాడు. 2022లో షాద్‌నగర్‌కు బదిలీ అయినా.. అధికారులు డిప్యుటేషన్‌పై బాన్సువాడలోనే కొనసాగిస్తున్నారు. పని ఒత్తిడికి తోడు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు యత్నించినట్లు తెలుస్తోంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాంత్‌ను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రాజేంద్రకుమార్ పరామర్శించారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని జిరాయత్‌నగర్‌లో మట్కా నిర్వహిస్తున్న, ఆడుతున్న పలువురిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. మొత్తం ఆరుగురిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ.13వేలు, 6ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పేకాడుతున్న నలుగురు..

సిరికొండ: మండలంలోని మైలారం గ్రామ శివారులో పేకాడుతున్న నలుగురిని పట్టుకున్నట్లు ఎస్సై రామ్ శుక్రవారం తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ.5300 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మహిళ అదృశ్యం

ఆర్మూర్‌టౌన్: మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన అల్లెపు వెంకవ్వ అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ శుక్రవారం తెలిపారు. ఈనెల 5న వెంకవ్వ భర్తతో కలిసి తన కూతురు గ్రామం జక్రాన్‌పల్లి మండలం సికింద్రాపూర్‌కు వెళ్లివస్తుండగా ఆర్మూర్ మండలం మామిడిపల్లి చౌరస్తా వద్ద ఆటోలో దిగింది. ఆ తర్వాత కనబడకుండపోయింది. ఎంతవెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో భర్త నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కుక్కల దాడిలో 10 గొర్రెల మృతి

కమ్మర్‌పల్లి: మండలంలోని నాగాపూర్ గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో 10 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామంలోని బాలమల్లేష్‌కు చెందిన గొర్లపాకలోకి గురువారం అర్ధరాత్రి కుక్కలు చొరబడి గొర్రెలపై దాడి చేశాయి. ఈ దాడిలో 10 గొర్రెలు మృతి చెందగా, 20 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం ఉదయం పాక వద్దకు వెళ్లిన బాలమల్లేష్‌కు గొర్రెలు చనిపోయి ఉండడంతో పంచాయతీ, పశుసంవర్ధకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సుమారు రూ. 2లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాలమల్లేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని బాధితుడు ఆరోపించాడు.

ఉమ్మడి జిల్లాలో దొంగల బీభత్సం

- పలు ప్రాంతాల్లోని తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడిన దుండగులు
- బంగారం, నగదు అపహరణ



రాజంపేటలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

రాజంపేట: మండల కేంద్రంలోని తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. రాజంపేటకు చెందిన మాణిక్య రాజమణి ఇంటికి తాళం వేసి బుధవారం ఊరికి వెళ్లింది. శుక్రవారం మధ్యాహ్నం రాజమణి ఇంటి తలుపులు తెరచి ఉండటంతో వారి ఇంటిపక్కనే నివసిస్తున్న కిరణ్ కుమార్ వారికి సమాచారం అందించాడు. వెంటనే రాజమణి ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా, వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దుండగులు ఇంట్లోని మూడున్నర తులాల బంగారు నెక్లెస్‌తో పాటు రూ. 10వేలు నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, విచారణ చేపడుతున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

నగరంలో ఆటో, బైక్..

ఖలీల్‌వాడి: నగరంలోని వేరువేరు చోట్ల రెండు వాహనాలు చోరీకి గురైనట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని గోదాంరోడ్డులో నిలిపేష్‌కుమార్ తన యాక్టివాను ఇంటి ముందు పార్క్ చేయగా, గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అలాగే జీజీహెచ్‌లో మంగళవారం రాత్రి పార్క్ చేసిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం ఆటో కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ రెండు చోరీ ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కామారెడ్డి పట్టణంలో..



సీసీ పుటేజీలో రికార్డయిన దుండగుడి దృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని కాకతీయనగర్ కాలనీలో శుక్రవారం వేకువజామున దొంగలు కలకలం సృష్టించారు. ఉదయం 3గంటల ప్రాంతంలో బైక్‌పై కాలనీలోకి వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని దుండగులు తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకున్నారు. కాలనీలో నివాసం ఉండే నిఖిల్ అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి, కుటుంబంతో కలిసి ఊరికి వెళ్లాడు. దుండగులు అతడి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో దాచిన 3 తులాల బంగారం, రూ.30 వేల నగదును ఎత్తుకెళ్లారు. అదేకాలనీలో ఉండే మరో ఇంటి తాళం పగులగొట్టి చోరీకి యత్నించారు. ఆ ఇంట్లో ఎలాంటి విలువైన వస్తువులు లభించకపోవడంతో వెళ్లిపోయారు. ఉదయాన్నే ఇంటికి వచ్చిన నిఖిల్ కుటుంబ సభ్యులు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని, విచారణ జరుపుతున్నారు.

నందిపేట మండలంలో..



సీసీ పుటేజీలో రికార్డయిన దుండగుడి దృశ్యం

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని వెల్మల్ గ్రామంలో ఓ ఇంట్లోకి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. వెల్మల్ గ్రామానికి చెందిన కుస్తాపురం శ్రీనివాస్ తన భార్య, తండ్రితో కలిసి శుక్రవారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. ఇంటి వద్ద ఉన్న తల్లి భోజమ్మ తలుపులకు గడియ పెట్టి ఖార్ధానాకు వెళ్లింది. తిరిగి ఇంటికివచ్చి చూసేసరికి తలుపులు తెరిచిఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా రెండు తులాల బంగారు నగలు, వెండి సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించారు. సమీపంలోని సీసీ పుటేజీలను పరిశీలించగా ఇద్దరు అనుమానాస్పద వ్యక్తులను గుర్తించారు. ఈమేరకు బాధితుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి



తుకారాం మృతదేహం

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడినట్లు ఎస్సై ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. మండల పరిధిలోని పెద్ద గుజ్జుల్‌తండాకు చెందిన జరుపుల తుకారాం(40) తన బైక్‌పై గాంధారి నుంచి తండాకు బయలుదేరాడు. గాంధారి మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న మద్దెల రవి బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో ఇద్దరు కిందపడిపోయారు. తుకారాం అక్కడికక్కడే మృతి చెందగా, రవికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలనికి చేరుకొని క్షతగాత్రున్ని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఒకరు..

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి డివైడర్‌ను ఢీకొని మృతిచెందినట్లు స్థానికులు తెలపారు. వివరాలు ఇలా.. గాంధారికి చెందిన ఒడుసుల సాయిలు(38) గురువారం రాత్రి తన బైక్‌పై వెళ్తూ మండల కేంద్రంలో రోడ్డు డివైడర్‌ను ఢీకొని కింద పడిపోయాడు. దీంతో బంధువులు అతడిని చికిత్స నిమిత్తం కామారెడ్డికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయమై ఎస్సై ఆంజనేయులును సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

బైక్‌ను ఢీకొన్న డీసీఎం: ఒకరికి తీవ్ర గాయాలు

రెంజల్(బోధన్): మండలంలోని కళ్యాపూర్ వద్ద శుక్రవారం ఓ బైక్‌ను వెనుకనుంచి వచ్చిన డీసీఎం ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎస్సై సాయన్న తెలిపిన వివరాలు ఇలా.. రెంజల్‌లో బీడీ కమీషన్ ఏజెంట్‌గా పని చేస్తున్న సత్యనారాయణ బీడీల గంపను బైక్‌పై పెట్టుకొని నవీపేట్‌లోని కంపెనీకి బయలుదేరాడు. మార్గమధ్యలో కళ్యాపూర్ గ్రామం వద్ద అతడి బైక్‌ను వెనుక నుంచి వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.